# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్




తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 13 నేరాలు

12 లక్షల విలువగల బంగారు ,వెండి ఆభరణాలు

25000,రూపాయల నగదు ఒక మొబైల్ ఫోన్ బైక్ స్వాధీనం

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నల్లగొండ


## సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

గురువారం 17 జూలై 2025 పేజీలు : 10



# గ్యాస్ సిలిండర్‌పై.. చిల్లర దోపిడి

7



గ్యాస్ సిలిండర్ రేట్ కు మించి వసూళ్లు.

ఒక్కో సిలిండర్ పై రూ.30 - 50 దాక వసూళ్లు

డెలివరీ బాయ్స్‌తో గ్యాస్ ఏజెన్సీల దందా

పట్టించుకోని సంబంధిత అధికారులు



## జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం

# బలమైన ఉద్యమాలు

జిల్లాలో పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి.. దివిస్ లాంటి పార్మా కంపెనీలకు వ్యతిరేకంగా ఉద్యమం

తెలంగాణ కు అన్యాయం చేయడానికి బనకచర్ల ప్రాజెక్టు.. అయిల్ పామ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలి

సిపిఐ నూతన జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా

# ‘ప్రత్యేక ప్రజావాణి’

ప్రతి బుధ,శనివారాలలో దరఖాస్తుల స్వీకరణ.. ఇసుక కొరత నివారణ కోసం శాండ్ బజార్ ఏర్పాటు

పట్టణ పారిశుధ్యం పై వంద రోజుల స్పెషల్ డ్రైవ్..

కొత్త రేషన్ కార్డుల పంపిణీ,అదనపు రేషన్ దుకాణాలు ఏర్పాటు

భూ సెటిల్మెంట్లకు పాల్పాడే వారిపై కఠిన చర్యలు .. సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బి ఎల్ ఆర్, సబ్ కలెక్టర్ వెల్లడి



# బాలికలకు చదువుతూనే ఉజ్వల భవిష్యత్తు

తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు




**తుంగతుర్తి(నూతనకల్), జూలై 16,(ప్రజా జ్యోతి):** బాలికల చదువు సమాజ అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుందని కుటుంబాన్ని నడిపించడంలో, సమాజాన్ని నడిపించడంలో చదువు చాలా కీలకమని తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు తెలిపారు. పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో నీ కస్తూర్బా గాంధీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నందు నూతనకల్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థిని లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ...బాలికలు ఆత్మవిశ్వాసం, మానసిక ధైర్యం కలిగి ఉండాలని కోరారు. ఉన్నత చదువుతున్న బాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.పరీక్షల కోసం ఒత్తిడి కి లోను కాకుండా ప్రశాంతత తో చదువుకోవాలనీ సూచించారు.సమస్యలు వస్తే కుంగిపోకుండా వాటినీ ధైర్యంగా ఎదుర్కోవాలని తెలియజేస్తూ, ఇలాంటి సమస్యలు వచ్చిన ఉపాధ్యాయులకు తెలపాలని కోరారు. చాలా సందర్భాలలో రెసిడెన్షియల్ పాఠశాల నందు బాలికలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఇలాంటి ధోరణి మానాలని, బాలికల ఆలోచనలో మార్పు రావాలని విజ్ఞప్తి చేశారు.మంచి భవిష్యత్తు కోసం కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పాఠశాలకు, విద్యను నేర్పిన గురువులకు మంచి పేరు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి, పాఠశాల ఎస్ఓ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయం గా 'ప్రత్యేక ప్రజావాణి'

ప్రతి బుధ,శనివారాలలో దరఖాస్తుల స్వీకరణ

ఇసుక కొరత నివారణ కోసం శాండ్ బజార్ ఏర్పాటు

పట్టణ పారిశుద్ధ్యం పై వంద రోజుల స్పెషల్ డ్రైవ్

కొత్త రేషన్ కార్డుల పంపిణీ,అదనపు రేషన్ దుకాణాలు ఏర్పాటు

భూ సెటిల్మెంట్లకు పాల్పాడే వారిపై కఠిన చర్యలు

సమీక్ష సమావేశం లో ఎమ్మెల్యే బి ఎల్ ఆర్, సబ్ కలెక్టర్ వెల్లడి



**మిర్యాలగూడ, జూలై 16,(ప్రజాజ్యోతి):** నియోజకవర్గంలోని ప్రజల వివిధ రకాల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మిర్యాలగూడలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రతి బుధ, శనివారాలలో ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలు కీలక శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ కే రాజశేఖర్ రాజు, మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ లతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఇలాంటి సమస్యలు ఉన్న ప్రతి బుధ శనివారాలలో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఫిర్యాదు చేసినట్లయితే ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు సమస్యను బదిలీ చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ ప్రజావాణిలో తన తోపాటు కీలకమైన అన్ని శాఖల అధికారులు పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం వందరోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో వారానికి ఐదు వార్డుల చొప్పున అదనపు సిబ్బందితో పరిశుభ్రం చేయనున్నట్లు తెలిపారు. చెత్తకుప్పలు లేకుండా చేయటం, డ్రైనేజీలు శుభ్రం చేయటం, దోమల నివారణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇసుక కొరతను నివారించేందుకు శాండ్ బజార్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇసుక అవసరం ఉన్నవారు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుకను తీసుకుపోవచ్చు అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు పెద్ద ఎత్తున మొక్కలను నాటాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, ప్రభుత్వం వికలాంగులకు వితంతువులకు అదనంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే వేసులుబాటు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా అన్ని రకాల భూ సమస్యలకు పరిష్కారం లభించనున్నట్లు తెలిపారు. డిజైన్ వ్యాప్తంగా వచ్చిన సుమారు 18వేల దరఖాస్తులు త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. పెరిగిన రేషన్ కార్డులకు అనుగుణంగా ప్రజల సౌకర్యం కోసం అదనంగా రేషన్ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ చౌక్ నుండి ఈదులగూడ వరకు జాతీయ రహదారి పనిలో భాగంగా ఇల్లులు కోల్పోయిన నిర్వాసితులకు 50 కోట్లు మంజూరు కాగా ఇప్పటివరకు 23 కోట్ల రూపాయలు నిర్వాసితులకు అందించడం జరిగిందన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభించకుండా పాఠశాలలు సంక్షేమ వసతి గృహాలు గురుకులాలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డి.ఎస్.పి కె రాజశేఖర్ రాజు మాట్లాడుతూ గంజాయి నివారణ కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి పది తర్వాత రోడ్లపైకి వచ్చేవారు తగిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని కోరారు. భూ వివాదాలలో తల దూర్చుతూ కొందరు రౌడీయిజానికి పాల్పడుతున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాస్ మాట్లాడుతూ మిర్యాలగూడ మున్సిపాలిటీ అభివృద్ధి చేసేందుకు ప్రజల సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కూడా చెత్తాచెదారాన్ని వీధుల వెంట పడేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఇ వెంకన్న, నేషనల్ హైవే ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలకలాడాల్సిన సర్కారు బడులు... వెలవెల బోతున్నాయి

తుంగతుర్తి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 40 లోపే విద్యార్థులు

ఒకే ప్రాంగణంలో రెండు హైస్కూల్ లు

విద్యార్థులు లేక అదనంగా ఉన్న బెంచీలు వేరే స్కూళ్లకు సర్దుబాటు.



**తుంగతుర్తి, జూలై 17,(ప్రజా జ్యోతి):** విద్యార్థులతో కళకళలాడాల్సిన సర్కారు బడులు వెలవెలబోతున్నాయి. విద్యార్థులు లేక పాఠశాలలో ఉన్న సామాగ్రిని ఇతర పాఠశాలలో సర్దుబాటు చేసే పరిస్థితి నెలకొన్నది.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 40 కిలోపు ఉండడంతో అందులో అదనంగా ఉన్న బెంచీలను మండల విద్యాశాఖ అధికారి బోయిన లింగయ్య వేరే ప్రభుత్వ పాఠశాలలకు తరలించారు. తుంగతుర్తి మండల కేంద్రంలో ఒకే ప్రాంగణంలో బాలుర బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. బాలుర పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉండగా బాలికల పాఠశాలలో 40 లోపు విద్యార్థులు ఉన్నారు.దీంతో విద్యార్థులు తక్కువగా ఉండడంతో అదనంగా ఉన్న బెంచీలను ప్రాథమిక పాఠశాల గానుగు బండ తుంగతుర్తి ప్రాథమిక పాఠశాలలకు బాలికల ప్రధానోపాధ్యాయులు కవిత బెంచీలు అందజేశారు.కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యావిధానంలో మార్పు తెస్తామని కొత్తగా వచ్చిన ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం చతికిలపడుతోంది. కొన్ని పాఠశాలలకు పట్టుమని పదిమంది పిల్లలు కూడా రావట్లేదు. సర్కారు విద్య పురోగ మించకపోగా.. తిరోగమనం వైపు పయనిస్తుండడం ఆందోళన కలిగించే అంశం.పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కృషిచేసిన దాఖలాలు కనిపించడం లేదనే ప్రజల నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా పాత రోజుల్లో మాదిరిగా గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరి ప్రభుత్వ బడులను బతికించాలని పలువురు కోరుతున్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు క్రీడా దుస్తులు బహుకరించిన అధ్యాపకుడు

– ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు



**నాగారం జులై 16 ప్రజా జ్యోతి.** నాగారం మండల పరిధిలోని పసునూరులో గల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో కాటమల్ల సోమ సుందర్ పిజిటి తెలుగు అధ్యాపకులు బుధవారం విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు దాదాపు పదివేల రూపాయల విలువచేసే స్పోర్ట్స్ డ్రెస్సెస్ ను బహుకరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బల్గూరి చంద్రబాబు మాట్లాడుతూ ఇలాంటి దాతృ హృదయం కలిగిన ఉపాధ్యాయులు ఉండటం సంతోషకరం అన్నారు. అధ్యాపకులు సోమ సుందర్ ను పాఠశాల ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు

# అధిక వడ్డీ ఆశ చూపి లక్షలు కాజేసిన కిలా(లే)డీలు

32లక్షలు వసూలు, లక్కీ స్కీమ్ పేరుతో మరికొందరికి శఠగోపం



**మిర్యాలగూడ, జూలై16,(ప్రజాజ్యోతి):** అధిక వడ్డీ,లక్కీ స్కీముల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఖిలాడి లేడీ తోపాటు మరో నిందితుణ్ణి మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి పలు డాక్యుమెంట్స్,బాండ్ పేపర్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు బుధవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు వివరాలను డీఎస్పీ రాజశేఖర్ రాజు మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బండి సంధ్య,సుందర్ నగర్ కు చెందిన అవిరెండ్ల అఖిల్ లు ఈజీ మనీ కోసం అధిక వడ్డీలు ఆశ చూపి మిర్యాలగూడ, నేరేడుచర్ల ప్రాంతాలకు చెందిన కొందరు నుండి సుమారు 32 లక్షలు వసూలు చేసి కొంతకాలం వడ్డీలు చెల్లించి తరువాత మోసం చేశారన్నారు.ఈ మోసాన్నికప్పిపుచ్చేందుకు ఫ్రెండ్స్ ఎంటర్ ప్రైజెస్ పేరుతో లక్కీ డ్రా స్కీములను మొదలుపెట్టి భారీ బహుమతులు ఆశ చూపి సుమారు 72 మంది వద్ద ఒక్కొక్కరి వద్ద నెలకు 1000 చొప్పున లక్షల రూపాయలు వసూలు చేశారన్నారు. ప్రకటించిన బహుమతులు అందించకపోగా బోర్డు తిప్పేయడంతో మోసపో యిన బాధితులు వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించి పిర్యాదు చేయడం తో కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.ఈ సందర్భం గా డి.ఎస్.పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ అధిక వడ్డీలకు ఆశపడి ప్రజలు మోసగాళ్ళ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. లక్కీ స్కీమ్లు,చిట్టీలు, అధిక వడ్డీల పేరుతో ఆర్థిక నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసును చాకచక్యంగా చేదించిన సిఐలు జె సోమ నరసయ్య,సిహెచ్ మోతిరామ్, ఎస్సై ఎ. సైదిరెడ్డి, కానిస్టేబుల్ ఎన్ శ్రీను, బి ప్రసాద్, ఎన్ సంధ్య లను అభినందిం చారు.

# రేషన్ కార్డుల కై వచ్చిన దరఖాస్తుల పై విచారణ చేసి పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి** నల్గొండ జులై 16(ప్రజాజ్యోతి ప్రతినిధి): రేషన్ కార్డుల కై వచ్చిన దరఖాస్తుల పై వెంటనే విచారణ చేసి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చండూరు ఆర్డీవో శ్రీదేవికి సూచించారు. బుధవారం ఆమె చండూరు ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అంతేగాక దరఖాస్తులను పరిశీలించారు. గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు భూభారతి దరఖాస్తులను కేటగిరి వారిగా విభజించుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి తగు సూచనలు చేశారు. రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులన్నిటి పై తక్షణమే తగు విచారణ చేయించి పరిష్కారించాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్ ఆర్డీఓ తో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# చండూరు ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

:ఇలా త్రిపాఠి

**చండూరు జులై 16 (ప్రజా జ్యోతి)** నల్గొండ జిల్లా చండూరు రెవెన్యూ ఆఫీస్ లో బుధవారం రోజు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ చేశారు. వీరితోపాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,చండూర్ ఆర్డీవో శ్రీదేవి పాల్గొని భూభారతి కింద వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నా కలెక్టర్. భూభారతి దరఖాస్తులను కేటగిరి వారిగా విభజించుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచన చేశారు.డివిజన్ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.



## నార్లు ఎండిపోతున్నాయి! సాగర్ నీటి విడుదల చేయరా!!



**నడిగూడెం :జులై 16, ప్రజా జ్యోతి:** కృష్ణ, గోదావరి పరివాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులపై ఉన్న ప్రాజెక్టులు నిండి ఆశాజనకంగా ఉన్నందున వెంటనే తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి మరియు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి వారబంధి పద్ధతిపై సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలని ఆయకట్టు రైతులు, రైతు సంఘం నాయకులు. కోరారు. వర్షాలు వస్తున్నాయని ఆశతో నార్లు పోసామని వర్షాలు రాక నీరు రాక నార్మల్ ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వారబంధీ పద్ధతిలోనైనా నీటి విడుదల చేయాలని ఆదర్శ రైతు, మాజీ సింగల్ విండో డైరెక్టర్ మారిశెట్టి నరసింహారావు తదితరులు కోరారు.

## మిర్యాలగూడ తహసీల్దార్ గా సురేష్ కుమార్



**మిర్యాలగూడ, జులై16,(ప్రజాజ్యోతి):** మిర్యాలగూడ నూతన తహసీల్దారుగా ఎస్. సురేష్ కుమార్ బుధవారం భాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన హరిబాబు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వచ్చిన సంతోష్ కిరణ్ వారం తిరక్కుండానే మరోచోటికి బదిలీ అయ్యారు. కొన్ని నెలలుగా తహసీల్దార్ సీటు ఖాళీ ఉండగా ఇన్చార్జిలతో నెట్టుకు వచ్చారు.మాడుగులపల్లి లో విధులు నిర్వహిస్తున్న సురేష్ కుమార్ బదిలీపై మిర్యాలగూడకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సురేష్ కుమార్ ను డిప్యూటీ తహసిల్దార్ జితేందర్, ఆర్ ఐ లు రామకృష్ణ, బి సత్యనారాయణ సిబ్బంది సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో రెవిన్యూ సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. సమస్యలు ఏవి ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

## గ్రంథాలయ నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయం

కార్గిల్ లాన్స్ నాయక్ పోలోజు గోపయ్య చారి మెమోరియల్



**పెన్ పహాడ్ మండలం జులై 16 (ప్రజా జ్యోతి): మండల** పరిధిలోని చీదెళ్ల గ్రామంలోని గ్రామపంచాయతీ దగ్గర గ్రంథాలయ నిర్మాణ ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు లచ్చుమల్ల వెంకన్న టియుటిఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షులు – మంజుల దంపతులు ముప్పై వేల నూట పదహారు రూపాయలను గ్రంథాలయానికి అందించారు. అదేవిధంగా పోలోజు సత్యనారాయణ ఎంపీడీవో – గాయత్రి దంపతులు ఇరవై ఐదువేల రూపాయలు గ్రంథాలయానికి అందించారు. గ్రంథాలయ నిర్మాణ ఏర్పాటు కు సహకరిస్తున్న వీరిని గ్రామ ప్రజలు, పలువురు, అభినందిస్తున్నారు. ఇంకా ఎవరైనా గ్రంథాలయ నిర్మాణానికి సహకరించే దాతలు ఉంటే సహకరించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని కోరుకుంటున్నారు.

# సాగర్ ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేయాలని..

ఎన్ఎస్పి ఈఈ కార్యాలయం వద్ద ధర్నా



**మిర్యాలగూడ,జూలై16, (ప్రజాజ్యోతి):** నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ బుధవారం సిపిఎం పార్టీ అనుబంధ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర, రైతు సంఘం నాయకులు డబ్బికార్ మల్లేష్,కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులుపాల్వాయి రామ్ రెడ్డి, మండల కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ రెడ్డి,మండల అధ్యక్షులు పోలేపల్లి గోవింద్ రెడ్డి, గాయం వీరారెడ్డి లు రైతులతో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని ఎన్.ఎస్.పి.ఈఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి,వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూనాగార్జునసాగర్ ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారని, సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 560 అడుగుల నీరు చేరిందన్నారు.శ్రీశైలం నుండి సాగర్ ప్రాజెక్ట్ కు 50 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుందని, ప్రాజెక్ట్ పూర్తిగా నిండే అవకాశం ఉన్నందున సాగర్ ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేసి వానకాలం సాగు పనులలో ఉన్న రైతులందరికీ మేలు చేసి ఆదుకోవాలని వారు కోరారు. పంటల దిగుబడి అధికంగా రావడానికి, ప్రభుత్వ యంత్రాంగం, ఎన్ఎస్పి అధికారులు సహకరించాలని రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లిఫ్టు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పాతూరి శశిధర్ రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, మండల పార్టీ కార్యదర్శి రవి నాయక్, కోటిరెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు చేయూగాని వెంకన్న పీఏసీఎస్ డైరెక్టర్ వస్కుల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

# మన తల్లిదండ్రులే మన హీరోలు.

:-కోదాడ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి



**మునగాల జూలై 16 ప్రజా జ్యోతి):-** సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐఏఎస్ ప్రాణాలిక ప్రకారం జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా భరోసా కార్యక్రమాన్ని మునగాల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాలు ఉన్నత చదువు చదువుకోవాలని కస్తూరిబా గాంధీ పాఠశాలలను ఏర్పాటు చేశారని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ,ఉపాధ్యాయుల చెబుతున్న పాఠాలను నేర్చుకుంటూ ,ఒక లక్ష్యంతో సమాజంలో జరుగుతున్న మంచి చెడులను ఆలోచిస్తూ ,ఒక ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మనకి కష్టం వచ్చినా ,ఏదైనా ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురైనా మన ఉపాధ్యాయులతో కానీ, తోటి విద్యార్థులతో కానీ, తల్లిదండ్రులతో కానీ పంచుకోవాలని, ఆ సమస్యపై చర్చించాలని తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకొని ఇబ్బందులకు గురి కావద్దని ,ఒత్తిడికి లోను కావద్దు అని ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని అన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని, తాను పడిన కష్టాన్ని, తనకు దక్కిన గౌరవాలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ముఖ్యంగా సెల్ఫోన్ కు దూరంగా ఉండాలని, అదేవిధంగా మన కుటుంబంలో కానీ, మన పాఠశాలలో కానీ ,ఉపాధ్యాయులు కానీ ఎవరైనా సెల్ఫోన్లు ఉపయోగించినట్లయితే వారికి సెల్ఫోన్ వల్ల జరిగే నష్టాలను వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునగాల ఎస్సై బి ప్రవీణ్ కుమార్ కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓ సునీత పోలీస్ శాఖ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలలో పోలీస్ ప్రజాబరోసా కార్యక్రమం



పెన్ పహాడ్ మండలం జూలై 16 (ప్రజా జ్యోతి): పెన్ పహాడ్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలనందు ఏర్పాటుచేసిన పోలీసు ప్రజా భరోసా అవగాహన కార్యక్రమంలో సూర్యాపేట సబ్ డివిజనల్ డీఎస్పీ ప్రసన్న కుమార్ హాజరై విద్యార్థులకు సామాజిక అంశాలు,దృఢ, మానసిక ధైర్యము వేధింపులను నిరోధించడము, ఆకతాయిలపై ఫిర్యాదు చేయడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ గారు మాట్లాడుతూ పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈరోజు ఇక్కడ విద్యార్థులతో కలిసి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఎవరైనా వేధింపులకు పాల్పడుతున్నట్లయితే అలాంటి వారిపై ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, డయల్ 100 కు సమాచారమిచ్చి ఇలాంటి వేధింపులను నిరోధించడంలో ముందుకు రావాలని కోరారు.దృఢ సంకల్పంతో ఉంటూ ఉన్నత లక్ష్యాలని ఏర్పాటు చేసుకొని కష్టపడి ఇష్టంతో చదవాలని అన్నారు. చిన్న చిన్న సమస్యలకు కుంగిపోవడం, ధైర్యం కోల్పోయి ఆత్మహత్యల లాంటి వాటికి పాల్పడవద్దు అని తెలిపారు. సమస్యలు ప్రతి ఒక్కరికి వస్తాయి వాటిని అధిగమించి విజయం సాధిస్తేనే పరిపూర్ణమైన వ్యక్తులుగా మారుతామని అన్నారు. బాలికలు మహిళలు ఎన్నో సందర్భాల్లో ఏదో రకమైన వేధింపులకు గురవుతున్నారని వీటిని రూపుమాపడం కోసం జిల్లా ఎస్పీ నర్సింహ ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు పటిష్టంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నో ఆశలతో ఎంత కష్టాన్నయినా భరిస్తూ పిల్లలకు ఉన్నత చదువులు చదివిస్తున్న తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని అన్నారు. దృఢ సంకల్పం, చదువు గొప్ప ఆయుధమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వెంట స్థానిక ఎస్సై కస్తాల గోపికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## కళాశాలలో విద్యార్థుల నమోదు ఆదర్శ శాతాన్ని పెంచాలి ...

ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రెటరీ భీమ్ సింగ్



**నడిగూడెం ,జూలై 16, ప్రజా జ్యోతి:** ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల నమోదు తో పాటు విద్యార్థుల రోజువారి హాజరు శాతాన్ని పెంచాలని ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని పరీక్షలకు సంసిద్ధం చేయాలని ఇంటర్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ భీమ్ సింగ్ అధ్యాపకులను కోరారు బుధవారం నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఈ విద్యా సంవత్సరం నమోదైన ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు రోజువారి విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి అధ్యాపకులు విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నందున , విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నడిగూడెం కళాశాల విద్యార్థులకు బస్సు హాస్టల్ వసతి కల్పించాలని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ జాన్ పాషా అధికారి దృష్టికి తీసుకువచ్చారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు అధ్యాపకులు శ్రీధర్ కృష్ణ మహేష్ వీరన్న ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి జన్మదిన వేడుకలు



**చండూరు జూలై 16(ప్రజా జ్యోతి)** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనయుడు సుశి ఇన్ఫ్రా మైనింగ్ లిమిటెడ్ కంపెనీ ఎండి కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చండూర్ పట్టణం లోనీ కస్తూర్బా గాంధీ పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులతో కేక్ కట్ చేయించి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్ లు అందజేశారు, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమం లో చండూరు మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు మాట్లాడుతూ 2025 – 26 సంవత్సరం లో 10 వ తరగతి లో మొదటి ర్యాంక్ వచ్చిన వారికి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ అధ్వర్యంలో నగదు బహుమతి కోమటిరెడ్డి లక్ష్మి – రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా అందచేయడం జరుగుతుంది అని అదేవిధంగా మీకు భవిష్యత్తులో చదువుకోవడానికి ఏ విధమైన సహాయం కావాలన్న చేస్తారని గొప్ప మనసున్న మహారాజు రాజగోపాల్ రెడ్డి అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెల్లంకొండ శేఖర్, మాస కృష్ణ,చిట్టిప్రోలు మహేష్, చండూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోము లింగస్వామి, ఖలీల్, నాగరాజు, శ్రీను, సమీర్, విష్ణు, ప్రవీణ్, రాజు, నరేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి అంగన్వాడి భవనం పూర్తి చేయాలి

**భూదాన్ పోచంపల్లి, జులై 16 (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని రామలింగంపల్లి గ్రామంలో అసంపూర్తిగా నిర్మాణమైన అంగన్వాడి భవనాన్ని పూర్తి చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కోటా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం రోజున సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో సూపర్డెంట్ సత్యనారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అంగన్వాడి భవనం కోసం నిధులు కేటాయించగా పిల్లర్లు వేసి పైన స్లాబ్ వేసి అసంపూర్తిగా వదిలేసారని దానివల్ల సొంత భవనం లేక ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలికంగా అంగన్వాడి కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని ఆ పాఠశాల కూడా శిథిల అవస్థను తలపిస్తూ పెచ్చులుడుతున్నాయని అన్నారు. వెంటనే అంగన్వాడీ కేంద్రానికి సరైన నిధులు కేటాయించి ఆసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ



సభ్యులు మంచాల మధు మండల కమిటీ సభ్యులు కోట అశోకు పట్టణ కమిటీ సభ్యులు బుగ్గ లక్ష్మయ్య వడ్డేపల్లి యాదగిరి నాయకులు లింగస్వామి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం బలమైన ఉద్యమాలు

జిల్లాలో పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి

దివిస్ లాంటి పార్మా కంపెనీలకు వ్యతిరేకంగా ఉద్యమం

తెలంగాణ కు అన్యాయం చేయడానికి బనకచర్ల ప్రాజెక్టు

అయిల్ పామ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలి

సిపిఐ నూతన జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**నల్గొండ జులై 16 (ప్రజా జ్యోతి)** నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. బుధవారం సిపిఐ నల్లగొండ జిల్లా కార్యాలయం ముఖ్దూం భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మహాసభ వివరాలు వెల్లడించారు. సిపిఐ నల్లగొండ జిల్లా 23వ మహాసభ దేవరకొండ పట్టణంలో ఈనెల 15వ తేదీ మంగళవారం విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహాసభలో జిల్లా కార్యదర్శి గా నెల్లికంటి సత్యం, సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్ లతోపాటు 45మంది కౌన్సిల్ సభ్యులు, 13మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. నల్లగొండ జిల్లాలోని పెండింగ్ సాగునిటీ ప్రాజెక్టు లను పూర్తి చేయడానికి నిర్ణీత కాలవ్యవధిని ప్రకటించి అందుకు సరిపడా అధిక నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాని కోరారు. కరువు పీడిత ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడం కోసం ఆనాడు కేసిఆర్ డిండి ఎత్తిపోతల పథకానికి హడావుడిగా శంకుస్థాపన చేశారు తప్ప, ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రాజెక్టు డిపిఆర్ ఆమోదించకుండా, ప్రాజెక్టుకు ఎక్కడినుండి నీరు తెస్తారో దానిపై స్పష్టత లేకుండా చేశారని ఆరోపించారు. తెలంగాణ కు తీవ్ర అన్యాయం చేసి నీటిని తరలించుకుపోయేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టును సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ కరువు పీడిత సమ స్యలతో అనేక ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఇప్పుడు ఫార్మా కంపెనీల ద్వారా కాలుష్యంతో అనారోగ్యలాకు గురై ప్రాణాలను పనంగా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు ప్రాంతంలోని కిష్టాపురం గట్టుప్పల చిట్యాల మండలంలోని వెలిమినేడు, పిట్టంపల్లి ప్రాంతాలలో విచ్చలవిడిగా ఫార్మ కంపెనీ నెలకొల్పేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని వాటిని తీవ్రంగా వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చౌటుప్పల్ ప్రాంతంలోని దివిస్ ఇలాంటి కెమికల్ కంపెనీ ద్వారా వెలువడే కాలుష్యం తో ఆ ప్రాంతం ప్రజలు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారని ఆ ప్రాంతంలో ఎక్కడ బోర్ వేసిన కెమికల్ ఆయిల్ తో కూడిన రంగు మారిన కెమికల్ నీరే వస్తుందని పేర్కొన్నారు. అలాంటి దివిస్ కంపెనీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు. నల్గొండ జిల్లా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నదని ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆయిల్ ఫామ్ పంటల సాగుకు మొగు చూపుతున్న నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలో ఆయిల్ ఫామ్ పరిశ్రమలను నెలకొల్పాన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్ సి వర్గీకరణ లాంటి అంశాలను సిపిఐ స్వాగతిస్తుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బీసీల మీద చిత్తశుద్ధి ఉంటే వెంటనే తమిళనాడు రాష్ట్రం తరహాలో 42 శాతం రిజర్వేషన్ లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొల్గురి నర్సింహా, గురిజ రామచంద్రం, నల్ప రాజు రామలింగయ్య, టి. వెంకటేశ్వర్లు, ప్రజ్యానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కె ఎస్. రెడ్డి లు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేత



**నాంపల్లి,జులై,16(ప్రజాజ్యోతి):**మండల కేంద్రానికి చెందిన గాదెపాక నారయ్య గత కొన్ని రోజుల ముందు నుండి గుండె సమస్యతో బాధపడుతూ అకస్మాత్తుగా హార్ట్ ఎటాక్ కి గురయ్యాడు. గ్రామస్తుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు గజ్జెల శివారెడ్డి తన దాతృత్వ హృదయంతో స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం కోసం నారయ్య కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఏదుల్ల రాములు, సైదులు, గాదేపాక రమేష్, మల్లయ్య, శ్రీకాంత్, నవీన్ , పెద్దులు, మధు, మారయ్య తదితరులు హాజరయ్యారు.

## యుటిఎఫ్ సభ్యత్వ నమోదు



**నల్గొండ జులై 16(ప్రజాజ్యోతి ప్రతినిధి):** ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యుటిఎఫ సభ్యత్వం ప్రతి ఉపాధ్యాయులు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పెరుమాల వెంకటేశం అన్నారు. బుధవారం చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి అన్ని సంఘంతో కలిసి పనిచేయడానికి మేము అందరం కలిసి కొత్తగా వస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు అరుణ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఏషమల్ల నాగయ్య, గడగొజు సతీష్, జానకి, రామలింగయ్య, రఘు, చంద్రశేఖర్, రామ్మోహన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని చుట్టు కాముడు పాడిన మహిళలు



**తుంగతుర్తి, జులై 16,(ప్రజా జ్యోతి):** వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో మహిళలంతా బుధవారం చుట్టు కాముడూ ఆడుతూ పాటలు పాడుతూ వరుణ దేవున్ని వేడుకున్నారు. పసుపు, కుంకుమలతో నీళ్ల బిందెను, వేప మండలను మధ్యలో పెట్టి అందంగా అలంకరించారు. సకాలంలో వర్షాలు కురకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వానదేవుడు కరుణించి వర్షాలు కురిపించి చెరువులు, కుంటలు నింపి పంటలు సమృద్ధిగా పండేలా చూడాలని చుట్టూ కాముడు వేస్తూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడికి సన్మానం

**హాలియా,జూలై16(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కు సేవలందిస్తూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సూరి వెంకటేష్ ఎన్నికైనారు. బుధవారం అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు రంగారెడ్డి జిల్లాకు చెందిన సూరి వెంకటేష్ తెలంగాణ కు గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్ర కబడ్డీ జట్టుకు పలుమార్లు ప్రాతినిధ్యం వహించి,జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని,ఉస్మానియా యూనివర్సిటీ జట్టుకు పలుమార్లు ప్రాతినిధ్యం వహించి ఆలిండియాలో మెడల్స్ సాధించడం జరిగింది.పోస్టల్ డిపార్ట్మెంట్ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి డిపార్ట్మెంటు జట్టుకు సేవలు అందించి ప్రస్తుతం కోచ్ గా వ్యవహరిస్తున్నారు.ప్రో కబడ్డీ లో తెలుగు టైటాన్స్ కు కోచ్ గా వ్యవహరించారు.గత కొన్ని సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కు సేవలందిస్తూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా జెడ్ పి హెచ్ ఎస్ హాలియాలో వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వారికి సన్మాన కార్యక్రమం



నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల పిడి వెంకటరామిరెడ్డి, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఏడుకొండలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎడవల్లి రాంబాబు, నరేష్, చంద్రశేఖర్, రాము, రమేష్, అనిల్, మంగ్య నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని కప్పల ఊరేగింపు

ఉదయం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

బుధవారం సాయంత్రం భారీ వర్షం

**నాంపల్లి, జులై, 26(ప్రజాజ్యోతి):**వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ బుధవారం నాంపల్లి మండలం పెద్దాపురంలో గ్రామ దేవతలకు ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. రోకలి బండకు కొత్త గుడ్డలో ఒక కప్పను కట్టి దానిని రోకలిబండ మధ్యలో వేలాడదీసి ఆ కప్పను పసుపు, కుంకుమలతో అలంకరించి డప్పుసప్పులతో గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి బిందెలలో నీళ్ల తీసుకువచ్చి వర్షాలు కురవాలని సమీపంలోని నదులు లేదా చెరువులో గంగపూజలు, ఆలయాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురవక పంటలు ఎండిపోయి రైతన్నల ఇబ్బందులు వర్ణనాతీతం... పంటలు వేసే సమయంలో వర్షాలు కురవనప్పుడు రైతులు ,ప్రజలు సంప్రదాయం పాటించారు. ఉదయం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



నిర్వహించడంతోనే బుధవారం సాయంత్రం నాంపల్లి లో భారీ వర్షం కురిసింది. భక్తుల ప్రగాఢమైన నమ్మకానికి వర్షం కురవడం నిదర్శనం..ఈ కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులు, మహిళలు చిన్నారులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వర్షాలు కురవాలని దేవుని ప్రార్థించారు.

# తండ్రి సంపాదించిన భూమి కోసం ఆడబిడ్డల పోరాటం

మాకు న్యాయం చేయాలిని స్టేషన్ ముందు నిరసన......

**మోతె జూలై 16( ప్రజా జ్యోతి ):** తన తండ్రి సంపాదించిన భూమికోసం ఆడబిడ్డలు పోరాటం చేస్తున్న సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని అప్పన్నగూడెం గ్రామ లో చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే ఏనుగు సురేందర్ రెడ్డి లకు సంబంధించిన భూమి సర్వే నెంబర్లు 589/ఇ, 589/ఈ, 590/ఇ లకు సంబంధించిన భూమి తమ 2011 వ సంవత్సరంలో మా నాన్న చనిపోయిన తరువాత మా తాత ఏనుగు జానిరెడ్డి మేము కొన్న కాగితాలు దాచి పెట్టి వి ఆర్ ఓ కి డబ్బులు ఇచ్చి తన కూతురు పులగం నీరజ పేరు మీద అక్రమంగా పట్టా చెప్పించినారు.ఇట్టి పట్టా జిల్లా కలెక్టర్ అక్రమంగా జరిగినది.అని పట్టా రద్దు చేసినారు .ఇప్పుడు ఇట్టి భూమి మీదకు పులగం నీరజ (మేనత్త) బయట ప్రయత్నం జరిగింది.అక్కడ మా గ్రామ ప్రజలు ఉండి కాపాడడం వల్ల నేను బ్రతికాను .బంధుత్వాన్ని మరిచి తీవ్రంగా దాడికి పాల్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ నాన్న చనిపోయిన తర్వాత ఆయన సంపాదించిన భూమి అక్రమంగా పట్టా వేసుకుని, తమను భౌతికంగా దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. వారు ఆయుధాలతో దాడికి దిగారు. మా తలలకు, చేతులకు గాయాలయ్యాయి. ప్రాణాలకు ముప్పుగా మారినప్పటికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు.వారు వెల్లడించిన వివరాల ప్రకారం, గత 13



ఏండ్లుగా జిల్లా కలెక్టర్, తహశీల్దార్, ఆర్ఐ తదితర అధికారులను కలిసి వారి ద్వారా ఆ పట్టా కు సంబధించి అన్ని ఆధారాలు ఉన్నా మాకు ఎలాంటి న్యాయం జరగక వాపోతున్నారు. "మా నాన్నగారి భూమిని తమ రాజకీయ, ఆర్థిక బలం తో ఆక్రమించుకునేందుకు మా మేనత్త కుట్ర పన్నుతున్నారు. అధికారులు మౌనంగా ఉండటం వల్లనే ఆమె మరింత రెచ్చిపోతుంది. ఇలాంటి దాడులు సైతం చేసేందుకు వెనుకాడడం లేదని వారు ఆరోపించారు. స్థానికులు, గ్రామ పెద్దలు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు. వారి భూమి హక్కును వారికి కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు . తమకు న్యాయం చేయాలని సురేందర్ రెడ్డి కూతుర్లు కోరుతున్నారు.

## గురుకులాల్లో మరణాలు. ప్రభుత్వ హత్యలే.



**నడిగూడెం, జులై 16 ,ప్రజా జ్యోతి:** నడిగూడెం మండల కేంద్రంలోని కేజీబీయులో పదవ తరగతి విద్యార్థిని ఫ్యాన్ కు ఉరి వేసుకొని మరణించడం అనేది చాలా బాధాకరం .కేజీబియుల్లో గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ సంక్షేమ హాస్టల్స్ లో గత 18 నెలల కాలంలో 100 మంది విద్యార్థులు మరణించడం అనేది ఇవి ఆత్మహత్యలు కావు ఇవి ప్రభుత్వ హత్యలు అని బిఆర్ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యులు అనంతుల ఆంజనేయులు అన్నారు .అదేవిధంగా, ఫుడ్ పాయిజన్ తో మరణించడం హాస్టల్స్ నిర్వహణ లోపం .పాము కాటికి గురి కావడం బిల్డింగ్ల యజమానుల నిర్వహణ లోపంగోడలు దూకి భవనం పై నుండి దూకి ఉరివేసుకొని చనిపోవడం పిల్లల మానసిక ఒత్తిడికి కారణం .పై వివిధ రకాల మరణాలన్నీ ప్రభుత్వం కానీ ఉన్నతాధికారులు కానీ పట్టించుకోకపోవడం ప్రభుత్వం సరియైన వసతులు కల్పించకపోవడం వలన జరుగుతున్నాయని అన్నారు .నడిగూడెం కేజీబీయుల్లో జరిగిన విద్యార్థిని మరణానికి తగు కారకులు ఎవరో నిర్ధారణ చేసి వారిని శిక్షించి విద్యార్థిని కుటుంబానికి 10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని లేనియెడల బిఆర్ఎస్ పార్టీ తరపున న్యాయ పోరాటం చేసి వారికి తగిన న్యాయం చేస్తామని అన్నారు....

## కారు ద్విచక్ర వాహనం ఢీ యువకుడు మృతి



**కోదాడ టౌన్, జూలై 16 (ప్రజా జ్యోతి):** కారు ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ వద్ద బుధవారం చోటు చేసుకుంది . కోదాడ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామానికి చెందిన ఈదా వెంకటేష్ (23) తన జీవనోపాధి నిమిత్తం మఠంపల్లి గ్రామంలో చేపల మార్కెట్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అతడు తన వ్యక్తిగత పనుల నిమిత్తం కోదాడకు వస్తున్న క్రమంలో బాలాజీ నగర్ సమీపంలో యూటర్న్ తీసుకున్న కారు బైక్ ను వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడి తీవ్ర గాయాలైన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు . వెంకటేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటన పై వెంకటేష్ తండ్రి ఈదా గోపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సుధీర్ కుమార్ తెలిపారు.

# ఆనారోగ్యాల బారిన పడి మరణాలు సంభవించకుండా

**సఫాయి మిత్ర కార్మికులకు ఆయుష్మాన్ ఆరోగ్యకార్డులు, భద్రత పరికరాలు, పీపీఈ కిట్లును పంపిణీ**

**మున్సిఫల్ కమీషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్**



**నల్లగొండ, జూలై16(ప్రజా జ్యోతి)** పారిశుద్ధ్య పనుల చేయడం వల్ల కార్మికులు ఆనారోగ్యాల బారిన పడి మరణాలు చెండకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు నల్లగొండ మున్సిఫల్ కమీషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ సానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే) డేలో బాగంగా బుధవారం కమీషనర్ చాంబర్ లో సఫాయి మిత్ర కార్మికులకు ఆయుష్మాన్ ఆరోగ్యకార్డులు, భద్రత పరికరాలు, పీపీఈ కిట్లును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నమస్తే కార్యక్రమంలో పారిశు ద్య కార్మికులతోపాటు ఘన వ్యర్థాలను సేకరించే వారిని, స్వయం సహాయ సంఘం సభ్యులు, స్థానిక కమ్యూనిటీ సభ్యులు కూడా కేంద్ర ప్రభుత్వం భాగస్వాములను చేసినట్లు తెలిపారు. పారిశు ద్ద్యాలు, ఘన వ్యర్థాలు సేకరించే సమయంలో కార్మికులు ఆనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారికి అవసరమైన కిట్లు, దుస్తులు ఇతర వస్తువులను కూడా మున్సిపాలిటి నుండి అందిచడంతోపాటు వారి సేకరణలో తీసుకోవాల్సన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా బ్యానర్లు, పోస్టర్లు, సామాజిక మీడియా వేదికల ద్వార విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సహాయపు కమీషనర్ రవీందర్రెడ్డి, డీఈ అశోక్, శానిటరీ ఇన్స్పెక్టర్లు నంద్యాల ప్రదీప్ రెడ్డి , శ్రీనివాస్, పర్యవరణ ఇంజనీర్ వి.సతీష్ రెడ్డి ,ఐటీసీ ఇంచార్జ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ పై.. చిల్లర దోపిడి

**గ్యాస్ సిలిండర్ రేట్ కు మించి వసూళ్లు.**

**ఒక్కో సిలిండర్ పై రూ.30 - 50 దాక వసూళ్లు**

**డెలివరీ బాయ్స్ తో గ్యాస్ ఏజెన్సీల దందా**

**పట్టించుకోని సంబంధిత అధికారులు**



చౌటుప్పల్, జులై 16 ( ప్రజా జ్యోతి ) చౌటుప్పల్ మండల వ్యాప్తంగా వంట గ్యాస్ ఏజెన్సీల డీలర్లు సిలిండర్ల సరఫరాలో నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.గ్యాస్ ధర రూ.919 కాగా రూ.980 అదనపు వసూళ్లతో వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి చమురు సంస్థల నిబంధనల ప్రకారం నిర్ణీత దూరం వరకు ఫ్రీగానే డెలివరీ చేయాలి. నిర్దేశిత దూరం దాటి గ్యాస్ సరఫరా చేస్తే నిర్ణీత మొత్తంలోనే డబ్బులు తీసుకోవాలి. కానీ కిలోమీటర్ దూరం కూడా లేనిచోట కూడా డబ్బులు వసూలు చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీకి కూత వేటు దూరంలో అందివ్వాల్సిన సేవలపైనా భారం మోపుతూ ఇబ్బందులు పెడుతున్నారు.

**రోడ్ల పైనే గ్యాస్ సిలిండర్ల డెలివరీ**

గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యం అండదండలతో డోర్ డెలివరీ చేయకుండా డెలివరీ బాయ్స్ రోడ్డు వెంట సెంటర్ల వద్ద మాత్రమే వినియోగదారులకు అందజేస్తూ వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలో కొందరు డీలర్లు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. డెలివరీ బాయ్స్ కంజుమర్ కు ఫోన్ చేసి చౌరస్తాల దగ్గరకు సిలిండర్ తీసుకురావాలని హుకుం జారీ చేస్తు సిలిండర్ పైన డెలివరీ చార్జిగా రూ. 50 రూపాయలు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**గ్యాస్ ఏజెన్సీల అత్యాశ..**

అదనపు వసూళ్లతో వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి చమురు సంస్థల నిబంధనల ప్రకారం నిర్ణీత దూరం వరకు ఫ్రీగానే డెలివరీ చేయాలి. నిర్దేశిత దూరం దాటి గ్యాస్ సరఫరా చేస్తే నిర్ణీత మొత్తంలోనే డబ్బులు తీసుకోవాలి. కానీ కిలోమీటర్ దూరం కూడా లేనిచోట కూడా ఒక్కో సిలిండర్పై రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీకి కూత వేటు దూరంలో అందివ్వాల్సిన సేవలపైనా భారం మోపుతూ ఇబ్బందులు పెడుతున్నారు.

**డెలివరీబాయ్ కి అదనంగా చార్జీలు చెల్లించాలా?**

ఇండియన్ ఆయిల్, హెచ్పీసీఎల్ కంపెనీలకు చెందిన డిస్టిబ్యూటర్లు ప్రజల నివాసాలకు దూరంగా గోడౌన్లను ఏర్పాటు చేసుకొని సిలిండర్లను సరఫరా చేయాలి. సాధారణ డిస్టిబ్యూటర్లు తమ గోడౌన్ పరిధిలో చుట్టు 10 కిలో మీటర్ల దూరం వరకు సిలిండర్ ఖరీదుపై అధికంగా వసులు చేయకుండా అందించాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏజెన్సీ షోరూమ్ నుంచి 10 కిలో మీటర్ల నుంచి 30 కిలోమీటర్ల వరకు సిలిండర్ సరఫరా చేస్తే రూ. 10 నుంచి రూ.20 తీసుకుంటారు. అధిక దూరం సరఫరా చేస్తే రూ. 30 మాత్రమే అధికంగా తీసుకోవాలని పౌరసరపర శాఖ నిర్ణయించింది. ప్రభుత్వం ప్రతీ సిలిండర్కు ఖరీదులోనే డెలివరీ చార్జీలు, ఏజెన్సీ కమీషన్, సబ్సిడీ అన్ని కలిపి నిర్ణయిస్తుంది. ఏజెన్సీ నిర్వహకులు డెలివరీ బాయ్స్కి జీతాలు ఇవ్వాలని తప్ప ప్రజల నుంచి కమీషన్ వసూలు చేయవద్దని నిబంధనలు ఉన్నాయి.

## వర్షాలు కురవాలని కప్పకాముడు ఆట ఆడిన మహిళలు



**చిట్యాల జులై 16(ప్రజాజ్యోతి ప్రతినిధి ):** నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గం, చిట్యాల మండలం, వట్టిమర్తి గ్రామంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, వాగులు, పొంగి పొర్లాడాలని పాడిపంటలు చల్లగా ఉండాలని బుధవారం కప్పలకు పెండ్లి చేశారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ కప్పకాముడు ఆట ఆడారు. వర్షాలు రాకపోవడంతో రైతులు ఇప్పటికే భూములలో వేసిన విత్తనాలు ఎండకు వేడి గాలులతో విత్తనాలు భూమిలోనే ఏండిపోతున్నాయని తెలిపారు. వానదేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిపించాలని కోరారు.

## పెన్ పహాడ్ ఎంపీడీవో గా బాలకృష్ణ బాధ్యతలు.



**పెన్ పహాడ్ మండలం జులై 16 (ప్రజా జ్యోతి):** సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం ఎంపీడీవో గా బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గతంలో ఎంపీడీవోగా విధులు నిర్వహించిన జన్జనాల వెంకటేశ్వరరావు నల్లగొండకు బదిలీ అయ్యారు. సూర్యాపేట ఎంపీడీవోగా విధులు నిర్వహించిన బాలకృష్ణ బదిలీపై పెన్పహాడ్ కు వచ్చి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు

## ఆరవ రోజు కొనసాగుతున్న గంధమల్ల రిజర్వాయర్ సర్వే పనులు



**తుర్కపల్లి మండలం జూలై 16 (ప్రజా జ్యోతి )** తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలో ఆదివారం రిజర్వాయర్ సర్వే పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ దేశ నాయక్ మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈ ఈ కవిత, డి ఈ రూపులా , ఏ ఈ ఈ లు అంజి మున్నీసా, అంబికా, లావణ్య, మధునాథ్, సర్వేయర్లు దేవా నాయక్, కనకయ్య ,శ్రీనివాస్, కాంట్రాక్టర్ గణేష్, ఆర్ ఐ జహంగీర్, ఎస్సై తక్యుద్దీన్ ,పోలీసులు పాల్గొన్నారు

# పేద,వెనుకబడిన తరగతుల విద్యార్థినులకు విద్యను అందించడమే కస్తూర్బా గాంధీ పాఠశాలల స్థాపన లక్ష్యం

హుజూర్ నగర్ సిఐ చరమంద రాజు

**గరిడేపల్లి,జూలై 16(ప్రజా జ్యోతి):** పేద,వెనుకబడిన తరగతుల విద్యార్థినులకు విద్యను అందించడమే కస్తూర్బా గాంధీ పాఠశాలల స్థాపన లక్ష్యం అని హుజూర్ నగర్ సిఐ చరమంద రాజు అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హుజూర్నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ విద్యార్థినులు చదువుపై ఆసక్తి చూపించి క్రమశిక్షణతో కూడిన జీవితం గడపాలని అన్నారు. సమాజంలో మహిళలకు ప్రాధాన్యత ఎంతో ఉందని, వారు మానసికంగా ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై స్పష్టత ఇచ్చి, చిన్నప్పటి నుంచే బాలికలు తమ సురక్షిత పరిధిని అర్థం అవగాహన, మంచి స్నేహితులతో కలిసిమెలిసి ఉండడం, ఇబ్బందులను ఉపాధ్యాయులకు తెలియజేయడం వంటి విషయాలపై వివరంగా మాట్లాడారు. విద్యార్థినులు చదువుకునే వయస్సులో ప్రేమ వంటి ఆకర్షణలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ఆత్మహత్యల ధోరణిని వీడాలని,ఏవైనా వేధింపులు ఎదురైతే వాటిపై



ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, అంతే కాకుండా తమ లక్ష్యాలను స్పష్టంగా ఎంచుకుని కష్టపడి చదివి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తెచ్చేలా ప్రవర్తించాలన్నారు.బాలికల రక్షణ చట్టాలు,షీ టీమ్స్, పోలీసు శాఖ లక్ష్యాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గరిడేపల్లి ఎస్ఐ చలికంటి నరేష్, ఎస్ఓ శైలజ, ఉపాధ్యాయినులు, 9మంది మహిళా కానిస్టేబుళ్లు, పోలీసులు, విధ్యార్ధినులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలలో బ్యాక్ లాగ్ సీట్లను వెంటనే భర్తీ చేయాలి

ఎస్ ఎఫ్ ఐ నాయకుల డిమాండ్

**మిర్యాలగూడ, జులై 16,(ప్రజాజ్యోతి):** గురుకులాలలో బ్యాక్ లాగ్ సీట్లను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.మిర్యాలగూడ డివిజన్ కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షుడు మూడావత్ జగన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో జాతీయ కమిటీ సభ్యుడు ఖమ్మం పాటి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు .తెలంగాణ రాష్ట్రం లో లిక్కర్ శాఖకు మంత్రిని కేటాయించి విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేద వర్గాలకు చెందిన విద్యార్థులు గురుకులాలలో చదువుతున్న రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలలో ఖాళీగా బ్యాక్ లాక్ సీట్లను భర్తీ ఉచిత విద్యను దూరం అవుతున్నారని తద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు వేలాది రూపాయలతో ప్రైవేట్ పాఠశాల పంపించి విద్యార్థులను చదివిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకులాలలో చదువుకునే పేద మధ్యతరగతి విద్యార్థులు సీట్ల సర్దుబాటు విషయంలోనూ ట్రాన్స్ఫర్ల విషయంలోనూ ఎలాంటి చిన్న తప్పు ఉన్న మాకు ఏమి సంబంధం లేదు గురుకులాల సెక్రటరీ కలవండి అంటూ జిల్లాలో ఉన్న గురుకులాల ఆర్ సి ఓలు పేద




మధ్యతరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్న రాష్ట్రంలో సంబంధిత శాఖల మంత్రులునిద్రపోతున్నారా అని ప్రశ్నించారు.తక్షణమే ఖాళీగా వున్నా గురుకులాల సీట్లు, విషయంలో ను, ట్రాన్స్ఫర్ లో విషయంలో ను గురుకులాల సెక్రటరీ లు జిల్లాఆర్ సి ఓ లకు కనీస పరిమితులతోనైనా వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్రంలో అన్ని గురుకులాల సెక్రటరీ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్ జిల్లా కమిటీ సభ్యులు ధీరావత్ వీరన్న, సంపత్,న్యూమన్, డివిజన్ నాయకులు మనీ అనిల్ తరుణ్ కిరణ్ వెంకటేష్ రఘు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి జన్మదిన వేడుకలు

**మునుగోడు: జూలై, 16, (ప్రజా జ్యోతి) న్యూస్...** మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తనయుడు సుశి ఇన్ఫ్రా మైనింగ్ లిమిటెడ్ కంపెనీ ఎండి శ్రీ.కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డి జన్మదినం సందర్భంగా మునుగోడు మండల కేంద్రంలోని జన్మదిన వేడుకలు మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ చౌరస్తా దగ్గర కేక్ కట్ చేసి పెద్ద ఎత్తున బాణాసంచారాలతో ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు హాస్పిటల్ సిబ్బందికి పండ్లు కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో చండూర్ మార్కెట్ చైర్మన్ దో టి నారాయణ,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జితేందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న పట్టణ



అధ్యక్షులు సాగర్ల లింగస్వామి, ఎండి అన్వర్, దుబ్బ ప్రభాకర్, పండ్ల బండి సైదులు, రాజు, నరసింహ, పందుల భాస్కర్,నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# షీ టీమ్స్. టి సేప్ యాప్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**కోదాడ టౌన్, జూలై 16( ప్రజా జ్యోతి):** సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కోదాడ డిఎస్పీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలో గల ఎన్ ఆర్ ఎస్ ఐ ఐ టి మరియు మెడికల్ అకాడమీ నందు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కోదాడ షి టీమ్ ఎస్ఐ మాధురి మాట్లాడుతూ విద్యార్థినులకు నూతనంగా ప్రవేశెట్టిన చట్టాల గురించి, షీ టీమ్స్ ను సంప్రదించే విధానం, మహిళల భద్రత, సామాజిక మాధ్యమాలను ఉపయోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, మరియు టి సేఫ్ యాప్ ను. ప్రతి బాలిక సెల్ లో టి సేఫ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని ఉండాలని తెలిపినారు. ఈ కార్యక్రమం నందు కళాశాల ప్రిన్సిపాల్ వేణు , ఇంచార్జ్ రామయ్య, షి టీమ్ మహిళా కానిస్టేబుల్ సాయి జ్యోతి , కళాశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చేయూత

మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ చాంద్ మియా



**గరిడేపల్లి,జూలై 16(ప్రజా జ్యోతి):** అనారోగ్యం పాలైన పేద కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయనిది చేయూతగా నిలుస్తుందని మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ చాంద్ మియా తెలిపారు. మండలంలోని కీత వారి గూడెం గ్రామంలో ఎనిమిది మంది నిరుపేద కుటుంబాలకు మంజూరైన నాలుగు లక్షల రూపాయల చెక్కులను బుధవారం ఆయన అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్యం పాలై చికిత్స పొందిన నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకునే అవకాశాన్ని కల్పించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ నిరుపేద కుటుంబాలకు ఎంతో అండగా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లోని తడుపునూరి అనసూయమ్మ కు 60 వేలు, శ్రీపాద గోవిందమ్మకు 60 వేలు, కుకడపు భరత్ 60 వేలు, చామకూరి మట్టయ్యకు 40 వేలు,బొమ్మ కంటి రామయ్యకు 60 వేలు,పాలెల్లి లిఖిత కు 38,500,దుప్ప ముత్యాలకు 32,500,షేక్ హుస్సేన్ కు 25 వేలు,కిత చంద్రకళకు 25,500 రూపాయలు మంజూరు కాగా సంబంధిత చెక్కులను బాధిత కుటుంబాలకు ఆయన అందజేశారు.ఈ కార్యక్రమంలో కీత సోమయ్య,నర్సింగ్ వెంకటేశ్వర్లు,కృష్ణమూర్తి, రామ్మూర్తి,వెంకన్న,సైదులు, మీరా, మదార్, పఠాన్ మదార్, నరసయ్య, కోటయ్య, బక్కయ్య, అంజయ్య, హుస్సేన్, రవి, నరసింహారావు, సైదులు, అంజి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేం ప్రకృతి ప్రేమికులం

పుడమి నాయకులం

యంగ్ ఎర్త్ లీడర్స్,స్కూల్ ఎర్త్ క్లబ్స్




**గరిడేపల్లి,జూలై 16,(ప్రజా జ్యోతి):** మేం ప్రకృతి ప్రేమికులం పుడమి నాయకులం,ఈ భూమిని నేలను,గాలిని, కలుషితం కాకుండా కాపాడుకుంటాం అని నూతనంగా ఎన్నికైన యంగ్ ఎర్త్ లీడర్స్,స్కూల్ ఎర్త్ క్లబ్ నాయకులు అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో గడ్డిపల్లి గ్రామం లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మరియు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో పుడమి నాయకులను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గడ్డిపల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డా. ప్రసన్న కుమారి పాల్గొని మాట్లాడుతూ పర్యావరణం లో అనేక రకాల మార్పులు జరుగుతున్న పట్టించుకునే వారే కరువయ్యారని,కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఎన్నో రకాల కంపెనీలు వచ్చి పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.వీటి ద్వారా మానవ మనుగడే గతి తప్పిపోతుందని,మనం రోజుల్లో ఆక్సిజన్ కోసం యుద్ధాలు జరిగే అవకాశం ఉందని పర్యావరణాన్ని కాపాడుకొని ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మొక్కలను పెంచడం పాఠశాల నుంచే ప్రారంభించాలని కోరారు. దీంతోపాటు మన గ్రామాన్ని గ్రీన్ విలేజ్ గా,గ్రీన్ పట్టణాలుగా తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు పచ్చదనాన్ని స్వచ్ఛమైన ఆక్సిజన్ ని అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మదర్ ట్రీ డిక్లరేషన్ చేసి,బేస్ లైన్ సర్వే చేయడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నికైన పుడమి నాయకులు మా వంతుగా పాఠశాలలో, మా ఇళ్ళలో, మా చుట్టుపక్క ప్రదేశాలలో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడటంలో కృషి చేస్తామని, ప్లాస్టిక్ నిషేధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి. నాగరాజు, విష్ణువర్ధన్, శ్రావణ్ కుమార్, శివకృష్ణ, మల్లికార్జున్ రెడ్డి, ప్రమీల, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ జిల్లా కోఆర్డినేటర్ మామిడి శంకరయ్య, కత్తి కోటయ్య, స్కూల్ ఏర్త్ క్లబ్, ఎంగ్ ఎర్త్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 13 నేరాలు

12 లక్షల విలువగల బంగార ,వెండి ఆభరణాలు

25000,రూపాయల నగదు ఒక మొబైల్ ఫోన్ బైక్ స్వాధీనం




**నల్గొండ జులై 16 (ప్రజా జ్యోతి)** గత కొంతకాలంగా నల్లగొండ జిల్లాలో తాళం వేసిన ఇళ్లలో పగలు, రాత్రి సమయల్లో ఇండ్లతో పాటు బైక్ డిక్కీల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 115.50 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి, రూ. 25 వేల నగదుతో పాటు మొబైల్ ఫోన్, బైక్ను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను నల్లగొండ డీఎస్పీ కె శివరాంరెడ్డి బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీఎస్, నల్లగొండ వన్ టౌన్ పోలీసులు, చందంపేట, పెద్దవూర పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేస్తుండగా దొంగలను పట్టుకున్నట్లు చెప్పారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు చందంపేట మండలం పోలేపల్లి క్రాస్ రోడ్ వద్ద బైక్పై అనుమానాస్పదంగా వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఆపి పాప్లాన్ డివైస్ (వేలిముద్రల తనిఖీ పరికరం)తో చెక్ చేయగా వారు పాత నేరస్తులైన బీసపోగు శాంసన్, కందరకొండ కృష్ణ కిశోర్గా గుర్తించినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో పలు దొంగతనాల్లో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలై మళ్లీ దొంగతనాలు చేస్తున్నట్లు వెల్లడించారన్నారు. చందంపేట, వాడపల్లి, చింతపల్లి, ఇబ్రహీంపేట, నేరేడుచర్ల, ఏపీలోని బెల్లంకొండ, బండ్లమోటు పోలీస్ స్టేషన్ పరిధిలో 9 ఇండ్లలో, రెండు వాహన డిక్కీల్లో దొంగతనాలను చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా కందరకొండ కృష్ణ కిశోర్ పెద్దవూర, పెబ్బేరుతో పాటూ మోత్కూర్ లో మూడు డిక్కీ దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. విచారణలో వీరిపై గతంలో తమిళనాడు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో దొంగతనం కేసులు ఉన్నట్లుగా గుర్తించినట్లు చెప్పారు. ఆదేవిధంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో వన్టౌన్ పరిధిలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా బంగారం అమ్మేందుకు దుకాణానికి వచ్చినట్లు సమాచారం రావడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా కాకినాడకు చెందిన దర్శడి దుర్గాప్రసాద్గా గుర్తించినట్లు చెప్పారు. నల్లగొండ పట్టణంలో ఇటీవల మూడు దొంగతనాలు చేసి బంగారం అమ్మే క్రమంలో పోలీసులకు చిక్కినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐలు ఏమిరెడ్డి రాజశేఖర్రెడ్డి, బీసన్న, సీసీఎస్ సీఐ జితేందర్రెడ్డి, ఎస్ఐ శివకుమార్, విజయ్కుమార్, శ్రీకాంత్రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి, పుష్పగిరి, నాగరాజు, వహీద్పాషా, గులాం దస్తగిరి, గణేశ్ పాల్గొన్నారు.

## పేదింటి నుంచి పీహెచ్ డీ పట్టా పొందిన ప్రొఫెసర్ డాక్టర్ జానయ్య

సీఎస్ఈలో ఉస్మానియా వర్సిటీ నుంచి డాక్టరేట్

ఓవైపు చిన్నచిన్న పనులు.. మరోవైపు చదువులు

టెన్త్,ఇంటర్ లో టాపర్.. ట్యూషన్లు చెబుతూ ఉన్నత చదువులు

పోటీ పరీక్షల్లో త్రుటిలో చేజారిన గ్రూప్-1 ర్యాంక్



**హాలియా,జూలై16(ప్రజా జ్యోతి)** పేద కుటుంబం.. పెద్ద కుటుంబం.. తండ్రి చిరుద్యోగి.. ఆర్థిక ఇబ్బందులు.. సామాజిక వివక్ష.. ఇన్ని కష్టాల మధ్య మరొకరైతే చదువును నిర్లక్ష్యం చేస్తారు.లేదా మధ్యలో వదిలేస్తారు. కానీ,ఆ యువకుడు పరిస్థితులను చాలెంజింగ్ గా తీసుకున్నాడు. పుస్తకమే సమస్తం అనుకున్నాడు. చిన్నచిన్న పనులు చేస్తూనే చదువు కొనసాగించాడు. ఇప్పుడు ప్రతిష్ఠాత్మక ఉస్మానియా వర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించే స్థాయికి ఎదిగాడు. ఇదంతా నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన బొడ్డుపల్లి జానయ్య ఆదర్శ ప్రస్థానం. తాజాగా ఈయన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. ప్రతిష్ఠాత్మక సీబీఐటీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ పబ్బోజు (డైరెక్టర్, ఏఈసీ అండ్ సీవోఈ) గైడెన్స్ లో పీహెచ్ డీ పూర్తిచేశారు.జానయ్య తండ్రి పశువుల ఆస్పత్రిలో అటెండర్, తల్లి గృహిణి. వీరికి ఐదుగురు సంతానంలో ఒకరైన జానయ్య హాలియా జెడ్పీహెచ్ఎస్ లో చదువుతూనే గోలీ సోడాలు,పండ్లు అమ్మడం,మక్క బుట్టలు కాల్చి అమ్మడం వంటి పనులు చేస్తూ ఎంతో కొంత డబ్బు సంపాదిస్తూ కుటుంబానికి ఆర్థికంగా భారం కాకుండా చూసుకున్నారు. అదే సమయంలో పదో తరగతిలో స్కూల్ మొదటి ర్యాంకులో నిలవడం విశేషం. టెన్త్ లో ప్రతిభ కనబర్చడంతో హాలియా సృజన జూనియర్ కళాశాలలో ఇంటర్ ఉచితంగా చదివేందుకు అవకాశం ఇచ్చారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న జానయ్య.. ఇంటర్ లో హాలియా మండల టాపర్ గా నిలిచారు. ట్యూషన్లు చెబుతూ ఇంజనీరింగ్.. ఎంసెట్ లో 831వ ర్యాంక్ తో హైదరాబాద్ లోని ఎంవీఎస్ఆర్ కాలేజీలో చేరిన జానయ్య..ఆర్థిక అవసరాల కోసం ట్యూషన్లు చెప్పారు. ఇంజనీరింగ్ తర్వాత సివిల్ సర్వీస్ కోసం సన్నద్ధం అయ్యారు. ఉమ్మడి ఏపీలో 2006లో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల ఇంటర్వ్యూల్లో అవకతవకల కారణంగా త్రుటిలో ఉద్యోగ అవకాశం కోల్పోయారు. అయినా నిరాశ చెందకుండా తాను చదివిన ఎంవీఎస్ఆర్ కాలేజీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరారు. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)లో ఎంటెక్ చదివారు. యూజీసీ నెట్, టీఎస్ సెట్ అర్హతతో ఓయూలోనే పీహెచ్ డీ పూర్తిచేశారు.తోడబుట్టినవారికి స్ఫూర్తిగా..జానయ్య తాను చదువుకోవడమే కాదు తోబుట్టువులకూ స్ఫూర్తిగా నిలిచారు.కుటుంబానికి ఆసరాగా ఉంటూనే..చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్లను ఓయూలో ఎంఎస్సీ చదివేలా ప్రోత్సహించారు. 2021 లో పీహెచ్డీ ప్రస్థానంలోనే ఆరోగ్య(మూత్రపిండాల) సమస్య తో ఒక తమ్ముడిని కోల్పోయినా, గుండె ధైర్యంతో,ఆత్మ విశ్వాసం కోల్పోకుండా పీహెచ్డీ పూర్తి చేశాడు. పేద విద్యార్థులకు ఆసరాగా.. తాను చదువులకు చేతనైనంత సాయం చేస్తున్నారు. వారికి కెరీర్ పరంగా సలహాలిస్తూ మార్గదర్శిగా వ్యవహరిస్తున్నారు. అలా జానయ్య టీచింగ్ లోనో, సలహాలు పొందినవారు ఇప్పుడు పలు రంగాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు పీహెచ్ డీ సాధించి డాక్టర్ జానయ్య అయిన తాను.. భవిష్యత్ లోనూ ప్రతిభావంతులైన, పేదింటి విద్యార్థులకు అండగా నిలుస్తానని చెబుతున్నారు. జీవితంలో ఏ దశలోనూ ఆశ కోల్పోకూడదని, పట్టుదల వీడకూడదని, పరిస్థితులను తలచుకుంటూ బాధపడొద్దని డాక్టర్ జానయ్య విద్యార్థులకు సూచిస్తున్నారు.

# సిపిఎస్ ను వెంటనే రద్దు చేయాలి ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలి

51 శాతం పిట్ మెంట్ తో వెంటనే పిఆర్సీ ప్రకటించాలి
పెండింగ్ డిఏలను అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలి
సిపిఎస్ విధానంను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చెయాలి
వివిధ శాఖల్లో ఉన్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి
నల్గొండ జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు నాగిళ్ళ మురళి



**నల్గొండ జులై 16 (ప్రజా జ్యోతి)** నల్లగొండ పట్టణ కేంద్రంలో టీఎన్జీవో భవనంలోతెలంగాణ ఎన్జీవో యూనియన్ నల్లగొండ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు నాగిళ్ళ మురళి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో కార్యదర్శి జె శేఖర్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహా చారి వివిధ హోదాలో ఉన్న అధ్యక్షులు కార్యదర్శిలు పాల్గొనడం జరిగింది. ఈ ఈ సందర్భంగా టీఎన్జీవో అధ్యక్షులు నాగిళ్ళ మురళి, కార్యదర్శి జె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ..జిల్లాలో ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధన కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి ప్రధానంగా పంచాయతీ కార్యదర్శులను గ్రేడులుగా విభజించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర సచివాలయంలో మరియు డైరెక్ట్ రేట్లలో 12.5 శాతం కోట అమలు చెసి అదే విదంగా మెడికల్ బిల్లుల క్లియరెన్స్ డి ఎ ప్రకటన కొన్ని శాఖలలో అదనపు కేడర్ స్ట్రెంత్ సమస్యలను పరిష్కరించినప్పటికీ ప్రధానంగా టీఎన్జీవో యూనియన్ ఇప్పటికే ప్రభుత్వం ముందు ఉంచిన 51 శాతం ఫిట్మెంట్ పిఆర్సి అమలు సిపిఎస్ ను రద్దు పెండింగ్ బిల్ చెల్లింపు హెల్త్ కార్డులు అమలుకై చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే త్వరలో లక్ష మంది ఉద్యోగులతో హైదరాబాద్ టీఎన్జీవో 80 వసంతాల సభకు జిల్లా నాయకత్వం తరుపున పూర్తి మద్దతు తెలిపారు. ప్రభుత్వంతో మనము సఖ్యతగా ఉంటేనే పెండింగ్ సమస్యలు సాధ్యమవుతాయని ఇట్టి సమస్యల సాధనకై పోరాటాలకు వెనుకడుగు వేయలని ఆయన తెలియజేశారు. ప్రభుత్వం త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తుందని అన్నారు. అలాగె జిల్లా ఉద్యోగులకు టీఎన్జీవో యూనియన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు ఏ లక్ష్మయ్య, వెంకట్ రెడ్డి, సైదులు, మదనాచారి, రణ దేవ్, మధు, రాజశేఖర్, ప్రవీణ్, నరేష్ ,వేణు, మనోజ్ ప్రదీప్, ప్రవీణ్ ,దశరథ్ శ్రీనివాస్ ,అంజనేయులు, భాస్కర్ ,రామకృష్ణారెడ్డి, ప్రశాంత్ రెడ్డి ,ఎండి షఫీ అనురాధ, సంధ్య, రజిత ,రవి నాయక్ ,మల్లికార్జున్ ,జానీ పాషా, శ్యామ్, వెంకటరమణ సోమేశ్వరి ,కమల ,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నవారు.

# ఈవీఎంల భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి

:డిప్యూటీ సీఈఓ,ఈవీఎం నోడల్ అధికారి హరి సింగ్



**గద్వాల జూలై16(ప్రజా జ్యోతి ప్రతినిధి):**ఈవీఎంల భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని,కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈఓ,ఈవీఎం నోడల్ అధికారి హరి సింగ్ పేర్కొన్నారు.బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను రాష్ట్ర స్థాయి బృందం డిప్యూటీ కలెక్టర్ (సీఈఓ కార్యాలయం) ఎస్.చెన్నయ్య,ఈవీఎం కన్సల్టెంట్ ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన తనిఖీ చేశారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాధారణ తనిఖీలో భాగంగా ఈ తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ భద్రత,ప్రవేశ నియమాలు,సీసీ కెమెరాల పర్యవేక్షణ, నమోదు పత్రాలు మొదలైన అన్ని అంశాలపై సమగ్రంగా పర్యవేక్షణ చేపట్టారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ హరి సింగ్ మాట్లాడుతూ, ఈవీఎంల భద్రత విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం లేకుండా, ఎన్నికల కమిషన్ జారీ చేసిన అన్ని మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు.స్ట్రాంగ్ రూమ్ లోపల మరియు బయట భద్రతా ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలన్నారు. నిరంతర సీసీ కెమెరా పర్యవేక్షణ జరుగుతుండాలని సూచించారు.ప్రతి రికార్డులో అన్ని వివరాలు స్పష్టంగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అలివేలు, గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్,ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్,సురేష్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ల కు అండదండగా ఉంటా

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి, జులై 16 (ప్రజా జ్యోతి):** వనపర్తి జిల్లా వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఫోటోగ్రాఫర్లందరికీ తాను ఎల్లవేళలా అండగా ఉంటానని ఎలాంటి సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని ఎం వై ఎస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఫోటోగ్రాఫర్లకు సంఘం తరపున అందించే రాష్ట్రస్థాయి గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ఫోటోగ్రాఫర్లందరికీ తాను ఎల్లవేళలా అండదండగా ఉంటానని ఫోటోగ్రాఫర్ల సంఘానికి కావలసిన సంఘ భవన నిర్మాణాన్నీ త్వరలోనే ఏర్పాటు చేసుకుందామని ఎమ్మెల్యే అన్నారు. సోనీ కంపెనీ తరపున నియోజకవర్గ పరిధిలోని ఫోటోగ్రాఫర్లకు వీడియో గ్రాఫర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్ల సంఘం నాయకులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం, గుణాత్మక విద్యను అందించాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
నిడమనూరు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ



**నల్గొండ జులై 16(ప్రజాజ్యోతి ప్రతినిధి):** విద్యార్థులకు నాణ్యమైన భోజనం, గుణాత్మక విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, నిడమనూరు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీ ఆవరణను, మౌలిక వసతులు, వంటగది, డ్రైనేజీ సిస్టం, స్టోర్ రూమ్, అన్నింటిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకోవడమే కాకుండా, వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలువేసి జవాబులను కాబట్టి వారిని చైతన్యవంతం చేసి చాక్లెట్లు పంచారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం విషయంలో రాజీ పడవద్దని, ఎక్కడా అపరిశుభ్రతకు తావివ్వవద్దని, మధ్యాహ్నం భోజనం నాణ్యతగా ఉండాలని, అదే విధంగా గుణాత్మక విద్యను అందించాలన్నారు. తాజా కూరగాయలు వాడడమే కాకుండా, ఎప్పటికప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా విద్యార్థులను చైతన్యం చేయాలని, పాఠశాల ఆవరణలో శుభ్రంగా ఉంచుకోవాలని, వంటగది శుభ్రంగా ఉండాలని, తాగునీరు, భోజనం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో రాత్రి భోజనం మరుసటి రోజు విద్యార్థులకు పెట్టవద్దని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వంట గదిలోని వంట సరుకులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, నిడమనూరు తహసిల్దారు, ఎంపీడీవో ,ఎంఈఓ, ఏఈ, తదితరులు ఉన్నారు.

# మహిళా కానిస్టేబుల్ పట్ల అసభ్య ప్రవర్తన

**హాలియా,జూలై16(ప్రజా జ్యోతి) :**పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న మహిళ కానిస్టేబుల్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్ ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. బుధవారం సాయంత్రం అనుముల గ్రామానికి చెందిన బొడ్డుపల్లి మురళి ( 37) మద్యం మత్తులో పోలీస్ స్టేషన్ కు వచ్చి విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ జ్యోతి పట్లా అసభ్యంగా ప్రవర్తించాడు.అదేవిధంగా పోలీస్ స్టేషన్ లో విధుల్లో ఉన్న ఇతర పోలీస్ సిబ్బందిని అసభ్యకరంగా దూషించాడు.తనకు రాజకీయ బలం ఉందనే పోలీసులతో బెదిరింపులకు పాల్పడ్డాడు.వెంటనే పోలీసులు స్పందించి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణ చేపట్టగా మురళి పై గతంలో 8 క్రిమినల్ కేసులు ఉన్నట్లు బహిర్గతం అయినట్లు సమాచారం.నిందితుడిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి చర్యలు చేపట్టినట్లు లా అండ్ ఆర్డర్ కు ఆటంకం కలిగించినట్లయితే ఎంతటి వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

# సాధారణ ప్రసవంలో 4.1 కిలోల శిశువు జననం

-ప్రభుత్వ ఆసుపత్రిలో రోజు 12 నుండి 15 ప్రసవాలు.
-గర్భిణీలకు స్కానింగ్ సౌకర్యం వసతి ఏర్పాటు
-మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఉషారాణి

**నాగర్ కర్నూల్ : జులై 16**(ప్రజాజ్యోతి ) నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రి లో బుధవారం ఖమ్మం జిల్లాకు చెందిన ప్రియాంక పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రి వచ్చారని ఆమెకు స్త్రీ వైద్య నిపుణులు సంబంధిత నర్సింగ్ సిబ్బంది చికిత్సలు అందించగా ప్రసవంలో 4.1 కిలోల బరువుగల నవజాత శిశువు జన్మించిందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టీ.ఉషా రాణి అన్నారు.తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నాని ఎలాంటి ఇబ్బంది లేకుండా సాధారణ ప్రసవంలో అధిక బరువుగల శిశువు జన్మించడంతో గైనకాలజీ వైద్యులను సిబ్బందిని సూపరింటెండెంట్ డా. ఉషారాణి అభినందించారు.ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రతిరోజు 12నుండి 15 ప్రసవాలు జరుగుతున్నాయని,గర్భిణీ స్త్రీలకు స్త్రీ వైద్య నిపుణులు ప్రత్యేకంగా సోమవారం నుండి శనివారం వరకు గది నెంబర్ 21లో సాధారణ పరీక్షలు జరుపుతున్నారని,గర్భవతులకు స్కానింగ్ సౌకర్యం వసతి ఏర్పాటు చేశామని గర్భిణీలకు తెలంగాణ డయాగ్నస్టిక్ ద్వారా అన్ని రకాల మూత్ర,రక్త పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన గర్భిణిలు ఆసుపత్రిలోనే సుఖప్రాసనం జరుపుకోవాలని, గర్భవతులకు హెల్ప్ డెస్క్ సేవలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ,డాక్టర్ సుప్రియ,డాక్టర్ కే.నికిత రెడ్డి, డాక్టర్ డి.ఝాన్సీ,డాక్టర్ ఎస్.ప్రవళిక, డాక్టర్ ప్రవీణ్ కుమార్, నర్సింగ్ ఆఫీసర్లు, మిడ్ వైఫ్స్,సిబ్బంది కే. లక్ష్మమ్మ,రేవతి, ప్రసన్న, సువేద,ే ణబుక, రాధ, శ్రావణి, డెస్క్ ఇంచార్జ్ టి.యాదగిరి,సరిత పాల్గొన్నారు.



# రాంపూర్ లో 10 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు భూమి పూజ

**నర్వ జూలై 16 ( ప్రజాజ్యోతి )** నారాయణపేట జిల్లా నర్వ మండలం పరిధిలోని, రాంపూర్ గ్రామంలో 10 లక్షల నిధులతో గ్రామ అభివృద్ధి పనులకు బుధవారం మండల పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, డిసిసి కార్యదర్శి నాగన్న గారి శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ నాయకులు నాగన్న గారి వివేకవర్ధన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఇట్టి పను లకు భూమి పూజ చేశారు, ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ మాట్లాడుతూ, గ్రామంలో అభివృద్ధి పనుల కోసం ప్రత్యేకంగా ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో ఇటి నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు, గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణం పనులను సకాలంలోవేగవంతంగా చేసి గ్రామాభివృద్ధికి అందరు సహకారం అందిస్తే మరింత అభివృద్ధి పనులను చేసుకోవచ్చని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొట్టు మూర్తి, నాగన్న గారి నరసింహారెడ్డి, రామేశ్వరమ్మ రాజేశ్వర్ రెడ్డి, నరసింహ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు



# బీసీ ముఖ్యమంత్రిని చేసే దమ్ము కాంగ్రెస్,బీఆర్ఎస్ కు ఉన్నదా?

బీసీలు స్థానిక సంస్థలకే పరిమితమా?
అసెంబ్లీ, పార్లమెంటులో బీసీల సీట్లు ఎవరు కబ్జా చేస్తున్నరు?
బీసీలేమో పంచాయతీలకు, అసెంబ్లీ,పార్లమెంటుకు మీరా?
ఆధిపత్య రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిన బీఆర్ఎస్,కాంగ్రెస్

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి 16 జూలై ( ప్రజా జ్యోతి):** స్థానిక సంస్థల రిజర్వేషన్ల పేరుతో మరో సారి బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ ఆరోపించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీఎస్పీ స్వాగతిస్తుందన్నారు. కానీ కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసే దమ్ము ఉన్నదా? అంటూ ప్రశ్నించారు. బీసీ లకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ తేవడం కాదు అసెంబ్లీ,పార్లమెంటులో వారి జనాభా నిష్పత్తి ప్రకారం సీట్లు ఎందుకు ఇవ్వడం లేదన్నారు.కేవలం ఎంపీటీసీ,సర్పంచులకే బీసీలను పరిమితం చేసి చట్ట సభల్లో బీసీల స్థానాలను ఆదిపత్య కుల పార్టీలైన కాంగ్రెస్,బీజేపీ,బీఆర్ ఎస్ కబ్జా చేసి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు.అసెంబ్లీ,పార్లమెంటుకు ఆధిపత్య కులాలు పోవాలె,స్థానిక సంస్థల్లో బీసీలు ఉండాలా? కాంగ్రెస్ చెప్పే సామాజిక న్యాయం ఇదేనా అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆధిపత్య కుల పార్టీలైన కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ పార్టీలను నమ్మి మోసపోవద్దని,అన్ని వర్గాలకు సామాజిక న్యాయం,జనాబా నిష్పత్తి ప్రకారం సీట్లు కేవలం బీఎస్పీ తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ జుట్ల నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య,జిల్లా కార్యదర్శి బండారి చంద్ర శేఖర్,జిల్లా ఈసీ మెంబర్ అశోక్,మక్తల్ అసెంబ్లీ ఇంచార్జ్ పాలెం వెంకటయ్య,జిల్లా నాయకులు బస్వరాజ్, పేట అసెంబ్లీ కోశాధికారి రమేష్,బీఎస్పీ నాయకులు గౌతం,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు



## అంగవైకల్యం గల వ్యక్తుల పట్ల ప్రేమతో మెలగాలి

-డిప్యూటీ లీగల్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య



**నాగర్ కర్నూల్ : (టౌన్) జులై 16** ప్రజా జ్యోతి రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు సెక్రెటరీ ఆదేశాల మేరకు బుధవారం సిరసవాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నాల్సా లీగల్ సర్వీసెస్ పర్సన్స్ విత్ మెంటల్ ఇల్నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజబులిటీస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక వైకల్యం చెందిన వ్యక్తుల పట్ల సమాజం సహృద్భావంతో మెలిగి వారికి అన్ని రకాలుగా సహాయపడాలని అన్నారు.మన భారతదేశంలో వికలాంగుల హక్కుచట్టాన్ని 2016 లో పార్లమెంట్ ఆమోదించిందని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టంలోని హక్కులను అమలు చేయడం వారి బాధ్యత అని,వ్యక్తిగత హోదా గౌరవం స్వేచ్ఛ సొంత నిర్ణయాలు కల్పించడానికి ఎలాంటి వివక్ష చూపరాదని,వ్యక్తులలో ఉండే తేడాలు,వైకల్యాలు మనుషుల మధ్యఉన్న తేడా మానవ పరంగా ఉండే వైవిధ్యంలో భాగంగా చూసి అంగీకరించి గౌరవించాలన్నారు.వైకల్యంగల వ్యక్తుల పట్ల క్రూరంగా ప్రవర్తించిన,హించించినా,అసహ్యంగా మాట్లాడి అగౌరవపరిచినా జైలుశిక్ష ఉంటుందని, ప్రకృతి వైపరీత్యాల నుండి,అనుకోని ప్రమాదాల నుండి వైకల్యం గల వ్యక్తులకు ఇతర వ్యక్తులతో సమానంగా రక్షణ,భద్రత కల్పించాలని అన్నారు. వారికి ఓటు హక్కు ఉంటుందని వారికి సంతాన ఉత్పత్తి కుటుంబ నియంత్రణలో సమాచారంపై అవగాహన కల్పించాలని,వికలాంగులు తమ సమస్యల గురించి ఉచిత టోల్ ఫ్రీ నెం.14416 ను వినియోగించుకోవాలని,ఇతర సమస్యలు సందేహాలు ఉన్నా ఉచిత న్యాయ సలహాలు సూచనల గురించి టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి లబ్ది పొందాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్. ఎమ్ ఏ. రమేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు, పత్రికా సోదరులు పాల్గొన్నారు.

## ఆస్తుల కోసం ఫ్యామిలీ ఫైట్

**నల్గొండ :** నల్లగొండ జిల్లా మునుగోడు మండలం సింగారం గ్రామానికి చెందిన కోడి చంద్రయ్య, అంజమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని సాగు చేసి ఇద్దరినీ పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేశాడు. కూతురు పెళ్లి సమయంలో ఇల్లు కానీ భూమిలో కొంత భాగం కానీ అమ్మి పెళ్లి చేయమని కొడుకు రాములు పెద్ద మనుషుల సమక్షంలో బాండ్ పేపర్ రాసి ఇచ్చాడు. అయితే పెళ్లికి కట్నంగా తామున్న ఇంటిని కూతురికి గిఫ్ట్ డీడ్ చేశాడు తండ్రి. కొద్ది రోజుల తర్వాత కొడుకు రాములు తల్లిదండ్రులిద్దరిని ఇంటి నుండి గెంటి వేయడంతో గ్రామంలో కిరాయి ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమకు కొడుకు రాములు ద్వారా మెయింటెనెన్స్ ఇప్పించాలని చంద్రయ్య దంపతులు ఆర్డీఓను కోరారు. అధికారుల ఆదేశాలు మేరకు ఉన్న భూమిలో కొంత భాగాన్ని కొడుకుకు ఇవ్వాలని, మిగిలిన భాగాన్ని తండ్రి చంద్రయ్య తీసుకునేలా గ్రామ పెద్దలు తీర్మానించారు. తిరిగి కొంతకాలంగా మిగిలిన భూమిని కూడా తనకు ఇవ్వాలంటూ వేధిస్తున్నాడని తండ్రి చంద్రయ్య వాపోతున్నాడు.వృద్ధాప్యంలో ఉన్న తమను? భూమికోసం కొడుకు రాములు ఇబ్బందులు పెడుతున్నాడంటూ మునుగోడు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు.